

# అనగనగా ఓ మంచి కథ

## ఘటన

### - మల్లాది వెంకటకృష్ణమూర్తి

### ( జ్యోతి 75 దీపావళి ప్రత్యేక సంచిక )

**సంధ్యా సమయం.**

సూర్యుడు విశ్రమించే తరుణం

వెలుగు చీకటిని పిలిచేవేళ.



మెటర్నిటీ హాస్పిటల్‌లో. 'డి' వార్డులో ఏడో నంబర్ బెడ్‌మీద నీరసంగా పడుకుని వున్న రాజవంశి మీద పడుతున్నాయి కిరణాలు. లాలనగా ఎదురుగా అద్దాల కిటికీలోంచి కనబడుతున్న, అస్తమిస్తున్న ఎర్రటి సూర్యబింబాన్ని పరికిస్తోంది రాజవంశి అన్యమనస్కంగా.

మంచం ప్రక్కనే వున్న మూడు కాళ్ళ చెక్క స్టూల్ మీద కూర్చునివున్న ఆరేళ్ళ బాబు రాజవంశి కొడుకు. బిక్క మొహం వేసి తల్లివంక చూస్తూ కూర్చున్నాడు.

తన రక్తాన్ని, తన ఊపిరిని పంచుకుని పుట్టిన కొడుకువంక చూసింది రాజవంశి. పక్కమీద, దిండుకింద దాచివుంచిన చిన్న హేండ్‌బేగ్ తీసి, దాంట్లో మిగిలివున్న రెండు పదిపైసల బిళ్ళలు తీసి, కొడుకుకు అందించి అన్నది రాజవంశి.

"కన్నా. పొద్దున తెచ్చిన బన్ రొట్టిలాంటిది తీసుకురారా."

తలవూపి, స్టూల్ మీదనుంచి దిగ్తూ అడిగాడు తల్లిని బాబు.

"ఆకలేస్తోందామ్మా?"

"రోడ్డు చూసుకుని దాటు. బళ్ళ అడ్డంగా పరిగెత్తక. త్వరగా రా."

కొడుకు ప్రశ్నకు సమాధానం చెప్పకుండా, కొడుకుని హెచ్చరించింది రాజవంశి.

రెండు ప్రక్కలా తెల్లటి రంగు పూసిన మంచాలమీద పడుకుని వున్న స్త్రీలని చూస్తూ, 'డి' వార్డులోంచి బయటకి నడిచాడు రాజవంశి కొడుకు.

రాజవంశి లేచి దిండు సద్దుకుని దానికి ఆనుకుని కూర్చుంది. తల ప్రక్కకి తిప్పి పక్క మంచంవైపు చూసింది. ఆ పక్క మంచంలో పడుకుని వున్న ఆమెకి పంతొమ్మిదిలోపే వుంటుంది వయసు. నిండు నెలలు స్టూల్ దగ్గరకి జరుపుకుని, కబుర్లు చెప్తున్నాడు ఆమె భర్త. చిన్నవాడే. అదృష్టం. బ్రతిమాలించుకుని తింటోంది ఏపిల్ ముక్కలు.

రాజవంశి కళ్ళు సగం తిని వదిలి వాళ్ళ బ్రెడ్ ముక్క మీద పడ్డాయి. ఉదయం నుంచి తినకుండా అలాగే వదిలేసింది. రేపటికి ఎండి పాడయిపోతుంది. పారేస్తారు. కుక్కకి వేసేస్తారేమో? అడిగితే?

"మీ చేతులతో తినడం ఇదే ఆఖరి సారయితే?" ఆ అమ్మాయి.

"అదుగో, అలా పిచ్చిపిచ్చిగా మాట్లాడితే నాకు మండుతుంది" ఆ భర్త కోపం.

కిలకిలా నవ్వింది ఆ అమ్మాయి. 'తన భర్తకి తనంటే ప్రాణం అన్న సంగతి స్పష్టమయేలా నవ్వింది' అనుకుంది రాజవంశి.

చిన్నగా నిట్టూర్చింది. దిండు సద్దుకుని, మళ్ళీ మంచం మీద పడుకుంది. కళ్ళు మూసుకుంది. ఆలోచించసాగింది. తను కూడా ఇలాగే అన్నది ఆ రోజు. కాని తనకి సమాధానం మరోలా వచ్చింది. ఏ రోజు?

చాలా సంవత్సరాల క్రిందట. తనకి అప్పుడు పధ్నాలుగేళ్ళే. చిన్నపిల్ల అప్పుడు తను. ఎవరితో అన్నది? రహీంతో. అవును. రహీం.

రహీం ఇప్పుడు ఎక్కడ వున్నాడో? ఏం చేస్తున్నాడో?

రాజవంశి తల్లి జ్వరంతో మూలుగుతూ పడుకుని వుంది. సరయిన ఆహారం లేక పోవడంవల్ల వచ్చిన జ్వరం అది. రాజవంశికి జ్వరంలేదు కాని. చెక్కముక్కల్నయినా సరే నమిలి మింగేయాలన్నంత ఆకలి వుంది ఆ రోజు.

నాలుగు రోజులనుంచి మంచినీళ్ళతో బ్రతకటంవల్ల నీరసం ఎక్కువవుతోంది. కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. కదిలే శక్తిలేక గోనె పట్టా పరుచుకుని పడుకుని వుంది రాజవంశి. కడుపులో పేగులు అరుస్తున్నాయి.

అలవాటే.

ఆ కాంపౌండ్‌లో ఎవరినడిగినా గుప్పెడన్నం పెట్టరు ఇక. అడిగి, అడిగి పెట్టించుకుని, పెట్టించుకుని ఆ స్థితి దాటిపోయింది రాజవంశి కుటుంబం. లేదు పొమ్మనిపించుకోవటం ఇష్టంలేక అలాగే పడుకుంది రాజవంశి ఎవరినీ అర్థించకుండా.

కళ్ళముందు నల్లటి చీకటి తెరలు కదులుతున్నాయి. ఆ రోజు కూడా సాయంత్రమే. ఎవరో పిలిచారు బయటనుంచి. లేచే శక్తిలేక కదలలేదు రాజవంశి.

"రాజీ.లే."

ఎవరో రాజవంశిని లేపి కూర్చోబెట్టి, నోటికి రొట్టె ముక్క అందించారు. రాజవంశికి అంతకు ముందెప్పుడూ జీవితంలో ఒక్కసారయినా రొట్టె ముక్క అంత విలువయినదిగా తోచలేదు.

పదహారేళ్ళ రహీం చిరునవ్వు నవ్వాడు. తెల్లని పలువరుస తళుక్కుమనేలా. చేతులు ఛాతీ మీద కట్టుకుని, దూరంగా నిలబడిన రాజవంశి రొట్టె తినటం పూర్తయ్యేదాకా చూస్తూ నిల్చుండిపోయాడు.

"నిన్నటినుంచి నువ్వు కనపడకపోతే ఇది మీకు తెచ్చిద్దామని ప్రయత్నం చేస్తున్నాను. నాన్న కంట్లో కారం కొట్టి రావడానికి ఇప్పటికికాని కుదరలేదు."

"చాలా బాగా చేసావు డబుల్ రోటీ" మెచ్చుకుంది రాజవంశి.

సిగ్గుతో తలవంచుకుని తన చేతులవంక చూసుకుంటున్న రహీంతో అన్నది రాజవంశి నవ్వుతూ.

"రహీం."

తలెత్తి కృతజ్ఞతతో మెరుస్తున్న రాజవంశి కళ్ళలోకి చూశాడు రహీం. తన కృతజ్ఞతంతా మాటల్లో పెట్టింది రాజవంశి. ఆ క్షణంలో తనకోసం ప్రపంచం అంతా దానం చేయగలిగే శక్తికల యోగిలా అనిపించాడు రహీం రాజవంశికి.

"రహీం! మళ్ళీ ఆహారం దొరక్కపోతే నేను చచ్చిపోతే ఎంత బావుంటుంది. ఇదే చివరి భోజనం అయితే ఎంత బావుంటుంది?"

రహీం కళ్ళలో ఆవేదన. రాజవంశి వయసుకి అర్థంకాని అనురాగం. ఆప్యాయత.

"నేను దగ్గర లేకుండా నీవు చచ్చిపోలేవు" అన్నాడు.

రెండు నెలల తర్వాత రాజవంశి కుటుంబం నిజామాబాద్‌లోని ఆ పెంకుటింటిని ఖాళీచేసేసింది.. చేయాల్సి వచ్చింది.

"బన్ లేదటమ్మా. అయిపోయిందిట. డబుల్ రొట్టె ఏభై పైసలట" ఉత్త చేతులతో తిరిగి వచ్చాడు రాజవంశి కొడుకు.

"పోన్లే."

"డాక్టర్ వస్తున్నారు. విజిటర్స్ అంతా బయటకు వెళ్ళాలి" హెడ్ నర్స్ గట్టిగా చెప్పింది, వార్డులోని రోగుల తాలూకు పేషెంట్లని వుద్దేశించి,

"ఈ డాక్టర్ కి ఇదో వింత ఆచారం. పేషెంట్లని చూసేటప్పుడూ ఎవరినీ దగ్గర వుండనివ్వడు" ఆ అమ్మాయి సణుగుడు.

"డాక్టర్ వెళ్ళాక వస్తా మళ్ళీ. పొద్దున్న సంగతి డాక్టర్‌తో చెప్పు" భర్త సమాధానం.

రాజవంశి డాక్టర్‌కి చెప్పాలనుకుంది రెండురోజులనుంచి కడుపులో పోట్లు వస్తున్న సంగతి. అవి కానుపు రాబోయే ముందు వచ్చే నొప్పులు కావు.

పోట్లు.

కడుపులో పిండం కదులుతున్న సూచనలేమీ అనిపించటంలేదు రాజవంశికి. అందుకే భయంగా వుంది. కాని డాక్టర్ ఎక్కువసేపు వుండడు.

టకటక బూట్లు చప్పుడు చేసుకుంటూ వచ్చాడు డాక్టర్ లోపలికి. సరాసరి 36 బెడ్ నెంబర్ దగ్గరకి వెళ్ళి, చార్ట్‌ని తిరగేసి, ఆ పేషెంటుని చూశాడు. తర్వాత మరో అయిదారుగురిని చూసి, వచ్చినంత వేగంగా వెళ్ళిపోయాడు. మరో రెండు హాస్పిటల్స్‌లో పేషెంట్లని కూడా చూడాలి ఆ డాక్టర్. ఆ డాక్టర్‌కి కొందరు డబ్బు అందిస్తూండటం చూసిన రాజవంశి ఎప్పుడో అనుకుంది తన దగ్గరకి రాడని. ఆ డాక్టరంటే జుగుప్స కూడా కలిగింది రాజవంశికి. నర్సుని అడిగింది రాజవంశి వద్దనుకుంటూనే.

"డాక్టర్‌కి చెప్పలేదా?"

నర్సు రాజవంశి మొహంలోకి నిరసనగా చూసి, సమాధానం ఇవ్వకుండా ఓ బెడ్‌వైపు నడిచింది. ఇంకోసారి ఆ పోట్లు వస్తే తట్టుకోలేక చచ్చిపోతానేమోనన్న భయం వేసింది రాజవంశికి. చచ్చిపోతేనే మంచిదనిపించింది వెంటనే.

మరణం. చిన్నగా నవ్వుకుంది.

"మరణం ఎన్నడూ దేనికీ పరిష్కారం కాదు" అన్న రాజమన్నార్ – డాక్టర్ రాజమన్నార్ ఇప్పుడిక్కడ వుంటే తననంత తేలికగా చావనిస్తాడా?

రాజమన్నార్.

ఎక్కడున్నాడు? ఎలా వున్నాడు?

నుదుటి మీద చల్లటి స్పర్శ తగిలింది.

"ఎలా వుంది వంశీ?"

కళ్ళు విప్పి చూస్తే ప్రక్కన కూర్చుని చూస్తున్న రాజమన్నార్. ధైర్యం చెప్తున్నట్లుగా చూస్తున్న చూపులు.

"మీ పెదనాన్న చూస్తే చంపేస్తాడు మనిద్దరినీ అయినా నువ్వెందుకు వచ్చావ్?" రాజవంశి అడిగింది రాజమన్నార్‌ని.

"ఆయన డిస్పెన్సరీకి వెళ్ళిపోయారు. మందు తాగావా లేదా?"

"తాగాను. ఇంక చేసేందుకు వేరే పనేం లేదుగా మరి."

"నీ వళ్ళు బాగా వేడిగా వుంది."

"మీ పెదనాన్న చెప్పలా? విషజ్వరం అట ఇది. వెళ్ళు రాజూ నా దగ్గర కూచుంటే నీకూ..."

"నాకు భయంలేదు వంశీ."

"కాని నాకు భయం."

"చలి తగ్గిందా?"

"నవ్వొస్తోంది. పనిమనిషిని ఇలా అడక్కూడదు. యజమానులు మీరంతా."

"అంతేకాదు. నీకెవరూ లేరు. నాకు నువ్వే."

"ఆగావే?.."

"మరో రెండేళ్ళలో నేనుకూడా డాక్టర్నయ్యి, ప్రాక్టీస్ పెట్టాక అప్పుడు పూర్తిచేస్తాను."

"ఈ లోపల మీ పెదనాన్నకి నావల్ల దహనం ఖర్చులు అవకుండా వుంటే."

"వంశీ నీలో ఆ నైరాశ్యం నాకు నచ్చదని ఎన్నోసార్లు చెప్పాను."

"నేనెలా పెరిగానో కూడా నీకు అన్నిసార్లూ చెప్పాను."

"మరణం ఎన్నడూ, దేనికీ పరిష్కారం కాదు."

"ఎందుకు కాదు."

"అయినా నిన్నంత తేలికగా  చావనిస్తానా? నేనెవరో తెలుసా? ఇప్పుడు సెవెంటీఫైవ్ పర్సెంట్ డాక్టరు."

నాలుగు నెలల తర్వాత రాజమన్నార్ పెదనాన్న రాజవంశిని పనిలోనుంచి తీసేసి, అరవైఏళ్ళ ముసలావిడని పనికి కుదిర్చాడు. రాజవంశి మళ్ళీ ఎప్పుడూ రాజమన్నార్‌నిగానీ, గుంటూరుని కానీ చూడలేదు.

"బెడ్ నంబర్ ఇరవై... స్ట్రెచర్...క్విక్.. బ్లడ్ గ్రూప్ ఏ.. రెడీ" వార్డులో అకస్మాత్తుగా హడావిడి.

రాజవంశి చూస్తూండగానే, ఇరవై నంబర్ బెడ్ మీది పేషెంటుని స్ట్రెచర్‌లో తీసుకెళ్ళారు. స్ట్రెచర్ ప్రక్కన ఆ అమ్మాయి భర్త నడుస్తున్నాడు ఆదుర్దాగా. రాజవంశి గుర్తుపట్టింది ఆ అమ్మాయి భర్తని. ఎక్కడ చూసిందో గుర్తుకు వచ్చింది చూడగానే.

ఆ రోజు హాస్పిటల్లో...

చాలా సంవత్సరాల క్రితం.

డబ్బుకోసం హాస్పిటల్‌కి వెళ్ళింది. తన రక్తం అమ్మి, డబ్బు సంపాదించుకోడానికి వెళ్ళింది. రక్తం అమ్మి, డబ్బు తీసుకున్నాక ఓ నర్స్ చెప్పింది. తను దానం చేసిన రక్తాన్ని ఓ పేషెంటుకి ఎక్కించామని, అతను తనని ఓసారి చూడగోరుతున్నాడని. వెళ్ళింది చూట్టానికి. చూసింది. పద్మనాభం వంటినిండా బేండేజ్‌లతో పడుకుని వున్నాడు నీరసంగా. సమయానికి వచ్చి తన ప్రాణాన్ని కాపాడినందుకు థాంక్స్ చెప్పాడు. తన ఎడ్రస్ చెప్పి "ఎప్పుడయినా ఏభైదాకా అవసరం వస్తే వచ్చి నిరభ్యంతరంగా తీసుకెళ్ళొచ్చు. రావడం ఇష్టంలేకపోతే, ఉత్తరం వ్రాస్తే మని ఆర్డర్ చేస్తాను" అన్నాడు పద్మనాభం.

తను ఉత్తరం వ్రాద్దామనుకుంది కాని, పద్మనాభం చిరునామా పోయిందన్న సంగతి డబ్బు అవసరం వచ్చేదాకా తెలియలేదు.

పద్మనాభం దాటిపోయాడు రాజవంశి పిలుపుని అందుకోకుండా. ఖంగారుగా వున్నాడు. నెమ్మదిగా అడగొచ్చు తర్వాత. అసలు తనని ఇంతకాలం గుర్తుపెట్టుకుని వుంటాడా?

ఆఖరి దశలో వున్న సూర్యబింబాన్ని చూస్తూ కూర్చుంది రాజవంశి. తల్లి ముఖం మీద పడుతున్న బంగారం రంగు సూర్యకాంతిని చూస్తున్నాడు రాజవంశి కొడుకు. మనసు మాత్రం ప్రక్క బెడ్‌మీద పడుకున్న అమ్మాయి వదిలి వెళ్ళిన ఏపిల్ పండుమీద వుంది.

ఇంక సూర్యుడు అస్తమించడానికి పది నిమిషాలయినా లేదు.

రాజవంశి చుట్టూ చేరారు నలుగురయిదుగురు విజిటర్స్, రాజవంశి అరుపులు విని. తల్లి కాళ్ళు పట్టుకుని ఏడుస్తున్నాడు రాజవంశి కొడుకు బిగ్గరగా. రాజవంశి రొప్పుతూ, మూలుగుతూ, బాధగా అరుస్తోంది పక్కమీద మెలికలు తిరిగిపోతూ.

హెడ్‌నర్స్ రాకలో ఆతృత లేదు, విసుగు తప్ప.

"ఏం జరిగింది?" నిర్లిప్తంగా.

"కడుపులో పోటు."

"వస్తానుండు ఇప్పుడే."

స్ట్రెచర్‌తో వచ్చింది, మరో ముగ్గురు నర్సులతో. స్ట్రెచర్ మీదకి చేర్చారు రాజవంశిని.

"అమ్మా – అమ్మా" ఏడుస్తున్నాడు రాజవంశి కొడుకు.

"ఏం కాదులే. అవతలకి జరుగు"

తెల్లటి యూనిఫాంలోని, తెల్లటి చర్మం లోపలవుండే గుండె తెలుపుకాదు. కరకు. నలుపు.

"మీ నాన్న ఏరిబాబు?" ప్రశ్న.

"నాల్నెల్ల క్రితం చచ్చిపోయారు" జవాబు.

తెల్లటి సీలింగ్. తిరుగుతున్న పంకాలు, వెలుగుతున్న ట్యూబ్‌లైట్లు వార్నిష్ చేసిన తలుపులు. తెల్లరంగుతో బోర్డుమీద అక్షరాలు — 'లేబర్ రూం'

ఆ బోర్డుకి పైన, గోడ మీద వున్న బొమ్మ. చక్కటి బంగారు రంగు ఫ్రేమ్ లో అందంగా ఉంచబడ్డ ఫోటోగ్రాఫ్. ఇక్కడికెలా వచ్చింది.

'అది విష్ణుకాంత్‌ది ' అనుకుంది రాజవంశి తనని లేబర్ రూములోకి చేరుస్తూంటే.

"రాజవంశీదేవిగారు."

"....."

"ఓ రాజవంశీ దేవిగారు."

"ఓయ్."

"ఏం చేస్తున్నారు దేవిగారు?"

"కనబడటంలా?"

"సాయంత్రందాకా రారు అమ్మా, నాన్నా"

"మిస్టర్ విష్ణుకాంత్. మీరు దయచేసి బుద్దిగా ఫేక్టరీకి వెళ్ళటం మంచిది."

"ఇలాంటి అవకాశం మనకి మళ్ళీ రాదు."

"వెళ్ళండి దయచేసి ప్లీజ్."

"లక్షలకి లక్షలు ఖరీదు చేసే ఆ ఫేక్టరీ నాకు, నీకన్నా ఎక్కువ కాదు. అయినా మేనేజర్ వున్నాడుగా. ఓ రోజు వెళ్ళకపోతే కొంప మునగదులెండి."

"మరి జాగ్రత్తగా మరోసారి ఆలోచించుకోండి. ఎంత పేదరాల్నంటే, కనీసం వుండటానికి ఇల్లయినా లేదు. మీ నాన్న ఉద్యోగంలోంచి తీసేస్తే, 'రేపు' అనేది 'రూఢి' వుండదు నాకు."

"రేపుకెప్పుడూ రూపులేదు. అయినా, ఈ విష్ణుకాంత్ అనే బానిస గుండెలో మీరు ఇల్లు కట్టేసుకున్నారెప్పుడో."

"అబద్ధం అంటాను."

"చీల్చి చూసుకోవచ్చంటాను."

"చేతకాదంటాను."

"చచ్చిపోయేదాకా – అన్ టు డెత్ – కలసి జీవిస్తానని బాస చేస్తున్నాను."

"నమ్మనంటాను."

అరగంట తర్వాత, ఇరవైనాలుగేళ్ళ రాజవంశి మొగాడి మాటల్లో పడి మోసపోయింది.

"రాజవంశీదేవి చూస్తూండు నీకు తాజ్‌మహల్‌లాంటి భవనం కట్టిస్తాను. నీ జీవితం నా జీవితం దాంట్లోనే అంతమవుతాయి.

రాజవంశి మోసపోయింది. కాదు మోసగింపబడింది. కాకినాడలో సముద్రం దాకా వెళ్ళింది ఆరు నెలల తర్వాత. కాని తెగించలేకపోయింది.

"డాక్టర్. సీరియస్ కేస్. లేబర్ రూములో వుంది."

"ఎంత?"

"ఇరవై ఏడో నంబర్ బెడ్. సిజేరియన్ కేస్. స్టిల్ బార్న్ అనుకుంటాను."

"బెడ్ నంబర్ ఇరవై ఇంకా అర్జెంట్ నన్ను డిస్టర్బ్ చేయకింక."

"యస్ డాక్టర్."

"ఇంకో సంగతి. ఇవాళ కాంత్ వస్తానని చెప్పాడు. రాగానే, నేనొచ్చేదాకా వుండమను."

"యస్ డాక్టర్."

ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్ళిపోయాడు డాక్టర్. నర్స్ మూసివున్న లేబర్ రూము తలుపు వంక చూసింది ఓసారి. తలుపుదాకా వెళ్ళి, తెరవబోయి, మళ్ళీ ఆ ప్రయత్నం విరమించుకుని వార్డులోకి వెళ్ళింది.

ఆ లేబర్ రూం తలుపు ముందు మాత్రం బితుకు బితుకుమంటూ చూస్తూ నిల్చుని వున్నాడు ఆరేళ్ళ రాజవంశి కొడుకు, కన్నీళ్ళు నిండిన కళ్ళతో. పావుగంటదాకా అలా నిల్చునే వుండిపోయాడు చూస్తూ. హడావిడిగా తిరిగే నర్సులు, దూరంగా వినిపిస్తున్న కారు హారన్ చప్పుళ్ళు. పావుగంట తర్వాత ఇక తన దుఃఖాన్ని ఆపుకోలేకపోయాడు.

నేలమీద కూర్చుని, మోకాళ్ళలోకి తలవంచుకుని మెల్లిగా ఏడవటం ప్రారంభించాడు.

హెడ్ నర్స్ రహీంని చూసి చిన్నగా నవ్వింది. గౌను జేబులోంచి పర్స్ తీసి రెండు పది రూపాయల కాగితాలు అందించి అన్నది.

"నీ రొట్టెలు ఈ మధ్య బావుండటంలేదు రహీం. వార్డులో పేషెంట్లు 'మోడ్రన్ బ్రెడ్' దొరికితేనే తెప్పించమంటున్నారు."

"కమీషన్ చాలదని సూటిగా చెప్పచ్చుగా" చిరుకోపంతో అన్నాడు రహీం.

"దాని సంగతలా వుంచు. నే చెప్పింది నిజం."

"హలో నర్స్, డాక్టర్ ఎక్కడ?" విష్ణుకాంత్ హడావిడిగా వచ్చాడు.

"రండి సార్. ఆపరేషన్ థియేటర్‌లో వున్నారు. మీరొస్తే మిమ్మల్ని ఎలాగయినా ఆపమని చెప్పారు. మీతో అర్జెంటుగా మాట్లాడాలట."

"నేను ఈవెనింగ్ ఫ్లైట్ పట్టుకోవాలి. ఫోన్ చేస్తే బేడ్ వెదర్ వల్ల గంటలేటని చెపితే ఇటువచ్చాను" చేతి గడియారం వంక చూసుకుని చెప్పాడు విష్ణుకాంత్. లేబర్ రూం గది తలుపు మీద వున్న తన ఫోటోగ్రాఫ్ వంక తృప్తిగా చూసుకున్నాడు. 'లేబర్ రూం డొనేటెడ్ బై విష్ణుకాంత్, ఇండస్ట్రియలిస్ట్ ' అని వ్రాసి వుంది అక్కడ.

"నర్స్. ఆపరేషన్ జరుగుతోందా?"పద్మనాభం ఆతృతగా అడిగాడు.

అవునన్నట్లుగా తలవూపింది.

"మరేం ప్రమాదం లేదుకదా?"

"ఉహూ."

"ఆ కుర్రాడెవరో ఏడుస్తున్నాడు?" మొదటిసారిగా రాజవంశి కొడుకుని చూసి అన్నాడు రహీం.

రహీంతోపాటు నర్స్, పద్మనాభం, విష్ణుకాంత్ చూసారు కూర్చుని నెమ్మదిగా వెక్కి, వెక్కి ఏడుస్తున్న రాజవంశి కొడుకుని.

"ఏం బాబూ? దేనికి ఏడుస్తున్నావ్?" అడిగాడు రహీం అతన్ని.

రాజవంశి కొడుకు తలెత్తి చూసాడు. అంతమంది తనవంక చూడటం గమనించి, కొద్దిగా సిగ్గుపడుతూ లేచాడు వెంటనే.

"నీ పేరేమిటి బాబూ?" అడిగాడు విష్ణుకాంత్ ఆసక్తిగా.

"కన్నా" చెప్పాడు.

"ఇదివరకు నన్నెప్పుడయినా చూసావా?" అడిగాడు, "నిన్నెక్కడో చూసినట్లుగా వుంది?"

తల అడ్డంగా తిప్పాడు కన్నా.

"దేనికి ఏడూస్తున్నావ్?" పద్మనాభం అడిగాడు.

"మా అమ్మ" అని ఆగి లేబర్ రూం వైపు చెయ్యి చూపించాడు.

"లోపల వుందా?"

"అవును."

"అయితే దేనికి ఏడుస్తున్నావ్?"

"నాకు భయంవేసి."

"దేనికీ?" నవ్వుతూ అడిగాడు రహీం.

"చచ్చిపోయిందేమోనని."

"ఛ. బ్రతికే వుంది" నర్స్ అన్నది చప్పున.

"హలో కాంత్" ఆపరేషన్ గదిలోంచి బయటకి వచ్చిన డాక్టర్ రాజమన్నార్ చెయ్యి చాపుతూ అన్నాడు సంతోషంగా.

"హలో రాజూ."

"ఎలా వుంది మా ఆవిడకి?" అడిగాడు పద్మనాభం ఆతృతగా డాక్టర్ రాజమన్నార్‌ని.

"మేల్ చైల్డ్. ఇద్దరూ ఆరోగ్యంగా వున్నారు. కంగ్రాట్స్."

"థాంక్స్ డాక్టర్."

"ఏమిటి? ఈ కుర్రాడెవరు? దేనికి ఏడుస్తున్నాడు" అడిగాడు డాక్టర్ రాజమన్నార్ నర్సుని.

"ఇందాక చెప్పానే. ఆ కేసు."

"ఓహో" అన్నాడు లేబర్ రూం వైపు ఓసారి చూసి.

"ఒక సెకండ్ డాక్టర్" అని నర్సు లేబర్ రూం తలుపు తెరచుకుని లోపలికి వెళ్ళింది.

"పదండి. మీతో మాట్లాడాలి. 'వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ' ద్వారా కెనడానుంచి కొంత ఎక్విప్‌మెంట్ సంపాదించాలి మనం. దానికి మీ సహకారం ఎంతయినా అవసరం."

"ష్యూర్. ష్యూర్" అన్నాడు విష్ణు కాంత్ గర్వంగా టై సర్దుకుని.

డాక్టర్ రాజమన్నార్, విష్ణుకాంత్ డాక్టర్ గదివైపు అడుగులు వేసారు.

రహీం ఆ రోజు కలెక్షన్ ఇరవై రూపాయలతో, బయటేవున్న బేకరీవైపు నడిచాడు నిశ్చింతగా.

పద్మనాభం ఆపరేషన్ థియేటర్ వైపు పరిగెత్తాడు తన కొడుకుని చూసుకోడానికి.

రాజవంశి ఆరేళ్ళ కొడుకు కన్నా, మళ్ళీ నేలమీద కూర్చుని ఏడవసాగాడు. బిక్కమొహం వేసి. నర్సు ఖంగారుగా బయటకి వచ్చింది.

చీకటి వెలుగు పిలుపుని అందుకుంది బయట.

COMMENTS